పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు

దమ్మపేట: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే జారే

టేకులపల్లిలో డీటీ ముత్తయ్య

చంద్రుగొండలో ఎంఈవో సత్యనారాయణ

పాల్వంచ, జూన్ 14 : బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాల్వంచ పట్టణ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. పాఠశాలలకు తోరణాలు కట్టి నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతాలు పలికారు. వారికి పలకా, బలపం చేతపట్టించి అక్షరాలు దిద్దించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకున్న విద్యార్థులందరినీ వారి తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించారు.

పాల్వంచ: నాగారాం కాలనీ పాఠశాలలో అక్షరాభ్యాసం

దమ్మపేటలో..

దమ్మపేట, జూన్ 14: బడి బాటలో భాగంగా మండలంలోని చలమప్పగూడెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. పిల్లలతో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఓనమాలు దిద్దించారు. ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, జడ్పీటీసీ మెంబర్ పైడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూన్ 14: మండలంలోని కొప్పురాయి, బర్లగూడెం, మొక్కంపాడు పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సామూహిక అక్షభ్యాసం కార్యక్రమం జరిగింది. పిల్లలతో డీటీ ముత్తయ్య ఓనమాలు దిద్దించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండలో..

చంద్రుగొండ, జూన్ 14: మండలంలోని పోకలగూడెం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం బడి బాటలో భాగంగా చిన్నారులకు ఎంఈవో సత్యనారాయణ అక్షరాభ్యాసం చేయించారు. నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు వెంకటరమణ, ఎస్ఎంసీ చైర్మన్ తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం ఆశ్రమ పాఠశాలలో..

దుమ్ముగూడెం, జూన్ 14: మండలంలోని ఆశ్రమ ప్రాథమిక పాఠశాల కొత్తపల్లిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతనంగా బడిలో చేరిన పిల్లలకు ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం లక్ష్మణరావు, ఏపీఎస్ హెచ్ఎం సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, భట్ట ప్రసాద్, ఆంజనేయులు, జ్యోతి, అనసూయ, లక్‌పతి, సీఆర్‌టీలు ప్రసాద్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ప్రవేశానికి ఆహ్వానం

అశ్వారావుపేట రూరల్, జూన్ 14: మండలంలోని గుమ్మడవల్లి టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ (బాలికల గురుకుల డిగ్రీ కళాశాల) డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గిరిజన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం ఆర్‌సీవో టి.వెంకటేశ్వరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీ.కాం (జి), బీ.కాం(సీఏ), బీజడ్‌సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్ గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. చేరదలిచిన వారు 63019 82428, 79930 88107, 93813 31472 సెల్ నంబర్లలో ఈ నెల 23వ తేదీ వరకు సంప్రదించవచ్చని సూచించారు.

పినపాకలో..

పినపాక, జూన్ 14: పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సకల సదుపాయాలు ఉన్నాయని, ఇక్కడ ఇంటర్‌లో చేరాలని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ శేషుబాబు కోరారు. ఆయన శుక్రవారం ఈబయ్యారం గ్రామంలో ఆ విద్యార్థుల, తల్లిదండ్రులను వారి ఇళ్ల వద్ద కలిశారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

టేకులపల్లి, జూన్ 14: స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులు ఎం.తేజస్వి, ఎస్.మహేందర్, వి.గీతాంజలి, ఎస్.గురుచరణ్.. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారు. వారిని శుక్రవారం ఎంఈవో ఠాగూర్ రాంసింగ్, హెచ్ఎం మెరుగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం

ఎర్రగుంట విద్యార్థి చరణ్‌కు..

అన్నపురెడ్డిపల్లి, జూన్ 14: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కాకిరాల చరణ్ ఎంపికయ్యాడు. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల నుంచి ఈ స్కాలర్‌షిప్‌కు ఇతడు ఒక్కడే ఎంపికయ్యాడు. చరణ్‌ను ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయిల్‌పామ్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా రామచంద్రప్రసాద్

దమ్మపేట, జూన్ 14ః ఆయిల్‌పామ్ అడ్వయిజరీ కమిటీ సుభ్యుడిగా రైతు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ నియమితులయ్యారు. మొత్తం 22మంది సభ్యుల్లో ఈయన ఒకరు. ఈ కమిటీకి ఉద్యానవన శాఖ మంత్రి చైర్మన్‌గా, ముగ్గురు ఎమ్మెల్యేలు, పామాయిల్ రైతులు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ కంపెనీల ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ కాల పరిమితి మూడేళ్లు.

మహిళను పరామర్శించిన ఎమ్మెల్యే

భద్రాచలం, జూన్ 14 : మందుపాతర పేలి గాయాలపాలైన సునీతను ఎమ్మెల్యే శుక్రవారం పరామర్శించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమెకు ప్రభుత్వం ద్వారా సహాయ, సహకారాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు అన్నదాన సత్రంలో భోజన ప్యాకెట్ల పంపిణీ

భద్రాచలం, జూన్ 14 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అన్నదాన సత్రంలోకి భారీ వర్షం కారణంగా వరద నీరు చేరినందున, భక్తులు కూర్చోని భోజనం చేసే అవకాశం లేకపోవడంతో భోజన ప్యాకెట్లు అందించడం జరుగుతుందని దేవస్థానం ఈవో రమాదేవి శుక్రవారం తెలిపారు.

గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దుమ్ముగూడెం, జూన్ 14 : మండలంలోని దుమ్ముగూడెం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న ర్యాపిడ్ ఫీవర్ సర్వే, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పుల్లారెడ్డి పరిశీలించారు. వానకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పూజలు

పెద్దమ్మతల్లికి అభిషేకం చేస్తున్న పూజారులు

పాల్వంచ, జూన్ 14: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీ కనకదుర్గ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, పూజలు వైభవంగా నిర్వహించారు. పాల్వంచకు చెందిన వనమా రంజిత్‌కుమార్, హారిక దంపతులు ఆలయ పునఃనిర్మాణానికి రూ.10,116 విరాళం అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

అన్నపురెడ్డిపల్లి, జూన్ 14: మండలంలోని తొట్టిపంపులో అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో మహాలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని టీచర్లతో చెప్పారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

కొత్తగూడెం క్రైం, జూన్ 14: చదవులో ప్రతిభను చాటుకుంటున్న హోంగార్డు కుమార్తెకు సైబరాబాద్ డీసీపీ డాక్టర్ వినీత్ గంగన్న చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. జిల్లాలో హోంగార్డుగా విధులు నిర్వర్తించే బిరుదరాజు రామచంద్రరాజు పెద్ద కుమార్తె జాహ్నవి మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ మెడికల్ కాలేజీలో ఉచిత సీటు పొంది ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చిన్న కుమార్తె శ్రీనిధి సైతం హన్మకొండ ప్రతిమ మెడికల్ కళాశాలలో ఉచిత సీటు పొంది కార్డియాకేర్ టెక్నిషియన్ మొదటి సంవత్సరం అభ్యసిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త ఖాదర్ జాహ్నవిని ప్రోత్సహించేందుకు బహూకరించిన ల్యాప్‌టాప్‌ను డీసీపీ తన కార్యాలయంలో శుక్రవారం అందజేశారు.

జాహ్నవికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న డీసీపీ వినీత్ గంగన్న

సమసమాజ స్థాపన కోసం పోరాడాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ, జూన్ 14 : సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి సమసమాజ స్థాపన కోసం ఐక్యంగా పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. పాల్వంచలో శుక్రవారం సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి మెరుగైన జీవన విధానాన్ని అందించగలిగేది మార్క్సిజం మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, షేక్ సాబీర్‌పాషా, బొల్లోజు అయోధ్య, విశ్వనాథం, లక్ష్మి, దస్రు, కేశవులు, యూసఫ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఆర్ఓఎఫ్ఆర్ భూములపై అవగాహన

ర్యాలీ తీస్తున్న ఫారెస్టు అధికారులు, ప్రజలు

టేకులపల్లి, జూన్ 14: మండలంలోని బోడు పంచాయతీ పరిధిలో గల బోడు కొత్తగూడెంలో ఆర్ఓఎఫ్ఆర్ భూములపై అటవీ సిబ్బందికి, ప్రజలకు ఫారెస్ట్ రేంజర్ ముక్తార్ హుస్సేన్ శుక్రవారం అవగాహన కల్పించారు. సిబ్బంది, అధికారులు కలిసి ర్యాలీ నిర్వహించారు. హుస్సేన్ మాట్లాడుతూ.. అటవీ భూముల్లోని చెట్లను నరకడం నేరమని అన్నారు. అటవీ భూములను సాగు చేయకూడదని చెప్పారు. అనుమతి లేకుండా బోర్లు, విద్యుత్ లైన్లు వేయరాదని అన్నారు. అనుమతితో వేసిన బోర్లకు సోలార్ విద్యుత్ ఉపయోగించవచ్చని చెప్పారు. ఎఫ్ఎస్‌వోలు బి.శ్రీనివాస్, దేవ్‌సింగ్, ఎఫ్‌బీవోలు హతీరామ్, నాగేష్, రాంసింగ్, మోహన్, గాంధీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి, జూన్ 14 : సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. చుంచుపల్లి మండల ప్రత్యేక అధికారి బి.సులోచన మాట్లాడుతూ వీధులు, పరిసరాలను ప్రజలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సమావేశంలో డాక్టర్లు నేహా, వాణి, ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీవో వి.అశోక్‌కుమార్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

బీవోఎం బ్రాంచ్ ప్రారంభం

బ్రాంచిని ప్రారంభిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం క్రైం, జూన్ 14 : ప్రజలకు సేవలందించేందుకు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) కొత్తగూడెం బ్రాంచ్‌ను శుక్రవారం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కొత్తగూడెంలో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం శుభపరిణామమని అన్నారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది ప్రజల మెప్పు పొందేలా సేవలు అందించాలని, వారి అవసరాలను తీర్చే విధంగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఓఎం హైదరాబాద్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, ఇతర బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లలో మెగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు

చర్ల, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ మేమున్నాం సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ సాయివర్ధన్ ప్రారంభించారు. 60 మంది యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజిరెడ్డి, లయన్ నీలి ప్రకాశ్, కొత్తపల్లి ఆంజనేయులు, స్వచ్ఛంద సేవకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన దుకాణాల తనిఖీ

చుంచుపల్లి, జూన్ 14 : కొత్తగూడెం మండలంలోని పలు విత్తన దుకాణాలను శుక్రవారం ఇంటర్నల్ స్క్వాడ్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇల్లెందు డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వాసవీరాణి మాట్లాడుతూ విత్తనాలు అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. సేల్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్ ఫైల్, పీసీ ఫైల్, బిల్‌బుక్స్, ఫిజికల్ స్టాక్స్‌ను పరిశీలించారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ అధికారి బి.గోపాలరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల్లో భారీ వర్షం


పెదవాగు ప్రాజెక్టులో కురుస్తున్న వర్షం

అశ్వారావుపేట రూరల్, జూన్ 14: మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన గుమ్మడవల్లి, కొత్తూరు, కోయ రంగాపురం, వడ్డెరంగాపురం, పెదవాగు ప్రాజెక్ట్, బచ్చువారిగూడెంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, ఈదురులు గాలులతో కూడిన భారీ వర్షం సుమారు రెండు గంటల పాటు కురిసింది. జన జీవనం స్తంభించింది. వాహనదారులు ఎక్కడికక్కడు నిలిచిపోయారు. రెండు దుక్కిలకంటే ఎక్కువగానే వర్షపాతం నమోదై ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ సాగుకు ఇది అనుకూలిస్తుందని అంటున్నారు.

ఆన్‌లైన్ సర్వే పరిశీలన

సర్వేను పరిశీలిస్తున్న డీఈ సలీం

అశ్వారావుపేట టౌన్, జూన్ 14: మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు, వినియోగదారుల వివరాలను సేకరించేందుకు అశ్వారావుపేటలో సాగుతున్న ఆన్‌లైన్ సర్వేను మిషన్ భగీరథ డీఈ సలీమ్ శుక్రవారం పరిశీలించారు. ప్రతి ఇంటకెళ్లి కుళాయి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. పంచాయతీ ఈవో గజవెల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్టూ కమిటీ ఎన్నిక

గుండాల, జూన్ 14: ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) ఏరియా నూతన కమిటీని శుక్రవారం గుండాలలో జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా శాంతయ్య, ఉపాధ్యక్షుడిగా నరి, సహాయ కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా పాషా, మరో 18 మంది సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

టేకులపల్లిలో..

టేకులపల్లి, జూన్ 14: ఇఫ్టూ ఏరియా మహాసభ శుక్రవారం టేకులపల్లిలో జరిగింది. జిల్లా కార్యదర్శి ఎస్‌కె.యాకుబ్ షావలి, నాయకులు వాంకూడోత్ నరేష్, జర్పుల సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేట: సమావేశంలో పాల్గొన్న అధికారులు, వైద్యులు, అశ్వారావుపేట టౌన్: మాట్లాడుతున్న డాక్టర్ రాందాస్, అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

పాల్వంచ, జూన్ 14 : వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఎంఈవో శ్రీరాంమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంతోనే ప్రజారోగ్యం

అశ్వారావుపేట, జూన్ 14: సంపూర్ణ పారిశుధ్యంతో సీజనల్ వ్యాధులను దూరంగా ఉంచవచ్చని, ప్రజారోగ్యాన్ని సాధించవచ్చని ఎంపీడీవో జి శ్రీనివాసరావు, వినాయకపురం, గుమ్మడవల్లి పీహెచ్‌సీల డాక్టర్లు రాందాస్, మధుళిక అన్నారు. పారిశుధ్య పరిరక్షణ, సీజనల్ వ్యాధుల నివారణపై మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సమావేశం చర్చించింది. ఎంపీవో సీతారామరాజు, ఈవో హరికృష్ణ పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి..

అన్నపురెడ్డిపల్లి, జూన్ 14: ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 20న ఒకటి నుంచి 19 ఏండ్లు లోపు వారికి నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

చంద్రుగొండ: పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కనకం తనూజ

గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్..

అశ్వారావుపేట టౌన్, జూన్ 14: సీజనల్ వ్యాధుల నివారణ చర్చించేందుకు అశ్వారావుపేట పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్ల సిబ్బంది, పంచాయతీ అధికారులతో డాక్టర్.రామదాసు శుక్రవారం స్థానిక పాత ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈవో గజవెల్లి హరికృష్ణ, ఏఎన్ఎం చిలకమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రుగొండ..

చంద్రుగొండ, జూన్ 14: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులోని గొత్తికోయల గ్రామాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కనకం తనూజ శుక్రవారం సందర్శించారు. పారిశుధ్యం, సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పినపాక..

పినపాక, జూన్ 14: మండలంలోని ఈ-బయ్యారం, తోగ్గూడెం, పినపాక పంచాయతీల్లో డ్రైనే.ఈలను మండల ప్రత్యేకాధికారి రాంప్రసాద్, ఎంపీవో వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు జైపాల్ రెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

పోలీసుల అదుపులో నిందితులు

ములకలపల్లి, జూన్ 14: పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. ఎస్సై రాజమౌళి తెలిపిన వివరాలు.. విశ్వసనీయ సమాచారంతో మండలంలోని తాళ్లపాయి గ్రామంలో గల ఓ ఇంటిలో గంజాయి ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం దాడి చేసి నుంచి ఐదు కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. దీని విలువ రూ.లక్ష ఉంటుంది. నిందితులైన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై రాజమౌళి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కొత్తగూడెం క్రైం, జూన్ 14 : ఇసుక ట్రాక్టర్‌ను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో పాతకొత్తగూడెం వాగు నుంచి వస్తున్న ఇసుకలోడు ట్రాక్టర్‌ను తనిఖీ చేశారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి, తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించినట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ముప్పారపు కరుణాకర్ తెలిపారు.

వాహనాల వేలం

కొత్తగూడెం క్రైం, జూన్ 14 : పోలీస్‌శాఖలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంటీవో సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సీజ్ చేసిన వాహనాలు, యజమానులు విడుపించుకోని వాహనాలకు ఈ నెల 27వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 306 ద్విచక్ర వాహనాలు, 17 ఆటోలు, కార్లు మొత్తం 323 వాహనాలు ఉన్నాయని తెలిపారు. కాలంచెల్లిన టైర్లు, బ్యాటరీలు, స్పేర్ పార్ట్స్‌కు 27వ తేదీన ఉదయం 10గంటల నుంచి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వేల వేయనున్నట్లు తెలిపారు. ఔత్సాహికులు 871268145 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

20న సంత వేలం

కొత్తగూడెం అర్బన్, జూన్ 14: కొత్తగూడెంలోని సంత వేలంను ఈనెల 20న నిర్వహించనున్నట్లు కొత్తగూడెం పురపాల సంఘం పన్నుల విభాగం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆదివారం సంత, దినసరి మార్కెట్, కబేళా మొదలగు వానికి ఫీజు వసూలు చేసుకొనుటకు కాంట్రాక్టు పద్ధతిన జులై 1, 2024 నుంచి మార్చి 31, 2005 వరకు 9 నెలలు అలాట్ చేయనున్నట్లు తెలిపారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

భద్రాచలం, జూన్ 14 : పట్టణంలోని కూనవరం రోడ్డులో ఇసుక ర్యాంప్ వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టణ ఎస్సై విజయలక్ష్మి పట్టుకున్నారు. రెండు ట్రాక్టర్లు ర్యాంప్‌లో ఉండగా పోలీసులు వస్తున్న సమాచారం అందుకున్న మరో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ర్యాంప్ వద్దకు వచ్చి ట్రాక్టర్‌ను స్వాదీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాలికపై లైంగిక దాడి

మణుగూరు టౌన్, జూన్ 14: చిన్నారిపై లైంగిక దాడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వాగు మల్లారం గ్రాఇమానికి చెందిన బాలిక(9) ఈ నెల 12న సాయంత్రం ఆరుబయట ఆడుకుంటున్నది. జానంపేటలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తున్న గాడిద శ్రీనివాస్, మద్యం మత్తులో అక్కడకు వచ్చి, బాలిక నోరు మూసి భవనంపైకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ చిన్నారి ఏడుస్తూ తన ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పింది. వారు శ్రీనివాస్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అతడు తప్పించుకుని బైక్‌పై పారిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో శ్రీనివాస్‌పై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అతడిని అరెస్ట్ చేశారు. కోర్టు ఆదేశంతో రిమాండుకు తరలించారు.

పూరిల్లు దగ్ధం


కాలిపోతున్న పూరిల్లు

దుమ్ముగూడెం, జూన్ 14 : మండలంలోని మారాయిగూడెం పంచాయతీ పత్తిపాకలో ఊయక బాలయ్యకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. వంట చేస్తుండగా అదే సమయంలో గాలి దుమారం వచ్చి ఒక్కసారిగా పూరింటికి అంటుకోవడంతో మంటలు పైకి ఎగిసిపడి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.